క్లుప్తంగా

ఎస్పీ శివ కిషోర్‌కు మహిళ కృతజ్ఞతలు



ఎస్పీకి కృతజ్ఞతలు చెబుతున్న అలివేణి

ఏలూరు టౌన్ : చోరీకి గురైన తన మోటారు సైకిల్‌ను పోలీసులు పట్టుకుని ఇవ్వడంతో ఓ మహిళ ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్‌ను శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపింది. ఏలూరు పవరుపేట వాసావారివీధికి చెందిన నేల అలివేణి అనే మహిళ తన మోటారుసైకిల్ గత నెల 23న చోరీకి గురైంది. ఆమె టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జిల్లా వ్యాప్తంగా ఎస్పీ శివ కిషోర్ ప్రత్యేక శ్రద్ధతో మోటారుసైకిళ్ల చోరీపై నిఘా పెట్టారు. ప్రత్యేక బృందాలను నియమించారు. ఈ నేపథ్యంలో గత నెల 27న 25 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో అలివేణి మోటారుసైకిల్ కూడా ఉంది. ఆమెకు మోటారు సైకిల్ ఇవ్వడంతో ఆనందం వ్యక్తం చేసింది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇటీవల సైబర్ నేరగాళ్ల ప్రజలను సులువుగా మోసం చేస్తున్నారని, వీటిపై అప్రమత్తంగా వ్యవహరించాలని ఏలూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్ మహిళా ఎస్సై నాగ కళ్యాణి అన్నారు. ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ప్రవేశపెట్టిన అభయ ప్రోగ్రామ్ గురించి శుక్రవారం డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు ఏలూరు 2 టౌన్ ఇన్‌స్పెక్టర్ వైవీ రమణ ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆపద సమయంలో పోలీసు సాయం కోసం డయల్ 112కు ఫోన్‌లో సమాచారం ఇస్తే, 10 నిమిషాల్లో భద్రత కల్పిస్తారని ఎస్సై నాగ కళ్యాణి తెలిపారు. బాల్యవివాహాలకు పూనుకుంటే 1098కు, సైబర్ నేరాలకు గురైతే 1930కి సమాచారం అందించాలన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక విద్యుత్ సర్కిల్ ఎస్ఈ కార్యాలయం వద్ద శుక్రవారం జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జి సంజీవరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల ఎలీజా, పీసీసీ అధికార ప్రతినిధి మద్దాల ప్రసాద్, గౌతు సత్యేంద్ర బాబులు మాట్లాడారు. ఇప్పటికే ప్రజలు రోజువారీ ఖర్చులతో ఇబ్బంది పడుతున్నారని వివరించారు.

జగనన్న కాలనీల్లో పనుల నిలిపివేత

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.8.49 కోట్లతో మెరక పనులు
- 1962 మంది పేదలకు లబ్ధి



శ్రీపర్రులో మెరకచేసిన జగనన్న కాలనీ

ఏలూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల పనులను కూటమి ప్రభుత్వం నిలిపేసింది. వైఎస్సార్ సీపీ హయాంలో చేపట్టిన తాగునీరు సరఫరా వ్యవస్థను గాలికొదిలేసింది. రోడ్లు అభివృద్ధి చేయడంలేదు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్రెయినేజీ పనులను నిధులు మంజూరుచేస్తే, చంద్రబాబు నిధులను పక్కదారి పట్టించారని తెలుస్తోంది. లబ్ధిదారులకు ఇల్లు కట్టుకునేందుకు హౌసింగ్ రుణం మంజూరు చేయడంలేదు. ఫలితంగా జగనన్న కాలనీలు నిరుపయోగంగా మారుతున్నాయి.

జగన్ హయాంలో కాలనీల ఏర్పాటు

ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చాటపర్రు, జాలిపూడి, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, గుడివాకలంక, మాదేపల్లి, శ్రీపర్రు, మల్కాపురం, మొండికోడు, మానూరు, కోమటిలంక గ్రామాల్లో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసింది. ఇందుకోసం రూ.20 కోట్లు వెచ్చించి భూమి కొనుగోలు చేసింది. తొలి విడత చాటపర్రు, పైడిచింతపాడు గ్రామాల్లోని కాలనీల్లో మెరక పనులు చేపట్టింది. విద్యుత్, తాగునీరు మౌలిక వసతులు కల్పించింది.

రూ.కోట్లతో మెరక పనులు

కొల్లేరు గ్రామాల్లోని బీసీ, ఎస్సీ కాలనీల్లో వర్షం వస్తే నీరు చేరుతోంది. రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. ఏటా వచ్చే వరద ముంచేస్తుంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ హయంలో జగనన్న కాలనీలను మెరక చేయాలని నిర్ణయించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.8.49 కోట్లు మంజూరు చేశారు. తొలి విడతలో గుడివాకలంకలో 5.24 ఎకరాల భూమిని రూ.106.58 లక్షలతో, కోమటిలంకలో 1.03 సెంట్ల భూమిలో రూ.26.72 లక్షలతో, గురుకులపేట 3.22 ఎకరాల జగనన్న కాలనీని రూ.47.60 లక్షలతో మెరక చేశారు. మాదేపల్లిలో 20.77 ఎకరాల భూమిని రూ.267.62 లక్షలతో, మానూరులో 1.86 సెంట్ల కాలనీని రూ.47.30 లక్షలతో మెరక చేశారు. శ్రీపర్రులో 10.86 ఎకరాలు రూ.203.78 లక్షలతో, జాలిపూడిలో 2.95 ఎకరాలను రూ.46.91 లక్షలతో, ప్రత్తికోళ్లలంకలో 2.37 ఎకరాలను రూ.61.50 లక్షలతో మెరక చేశారు. దీంతో 1962 మంది లబ్ధిదారులకు మేలు జరిగింది. మెరక పనులు చేపట్టడం వల్ల ఒక్కో లబ్ధిదారుడికి రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు మేలు జరిగింది.

నాటి కమిటీలు రద్దు

కాలనీల్లో పనులు వేగంగా నిర్వహించడంతోపాటు లబ్ధిదారులకు సహాయ సహకారం అందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మండల స్థాయిలో ఎంపీడీఓ, తహసీల్దార్, హౌసింగ్ ఏఈలతో పాటు సర్పంచ్, కార్యదర్శులతో ప్రత్యేక కమిటీలను నియమించింది. నేడు కూటమి ప్రభుత్వం ఆ కమిటీలను రద్దు చేసింది.

పేదల ఆగ్రహం తప్పదు

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీలు ఏర్పాటు చేయడం వల్ల పేదలకు ఎంతో మేలు జరిగింది. కొల్లేరు గ్రామాల్లో వందలాది మంది పేదలు సొంతిల్లు కట్టుకుని సంతోషంగా జీవిస్తున్నారు. ఇది చూసి ఓర్వలేని కూటమి ప్రభుత్వం కాలనీల్లో అభివృద్ధి పనులు నిలిపేసింది. గత ప్రభుత్వం చేపట్టిన మంచి పనులు, నేడు చంద్రబాబు కూడా కొనసాగించాలి. లేదంటే పేదల ఆగ్రహం తప్పదు.

– ముంగర సంజీవ్‌కుమార్, పైడిచింతపాడు, వైఎస్సార్ సీపీ వడ్డీకుల సంఘం అధ్యక్షుడు

రుణం మంజూరు చేయడంలేదు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్ల నాకు స్థలం ఇచ్చింది. ప్రభుత్వమే మెరక పనులు చేయడం వల్ల చాలా సంతోషించాను. అదే స్థలం నేను మెరక చేసుకోవాలంటే రూ.1 లక్ష ఖర్చు అవుతోంది. ఈ డబ్బు మాకు మిగిలినట్టే. ఈ డబ్బు ఇంటి నిర్మాణంలో ఖర్చు చేసుకోవచ్చు అనుకున్నాను. ఇప్పుడు అంతా తారుమారైంది. కాలనీల్లో ఇల్లు కట్టుకుందామనుకుండే హౌసింగ్ లోను మంజూరు చేయడం లేదు. అద్దె ఇంటిలోనే ఉంటున్నాం.

– బి.దుర్గ, శ్రీపర్రు

మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా సావిత్రి



ఏలూరు టౌన్ : ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పి.సావిత్రి నియమితులయ్యారు. ఆమె శుక్రవారం ఏలూరులోని మెడికల్ కాలేజీలో తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. సావిత్రి ఇప్పటి వరకు మర్కాపురం ప్రభుత్వాసుపత్రి సూపరింటిండెంట్‌గా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గతంలో శశిధర్ పనిచేయగా, తాజా బదిలీల్లో సావిత్రిని నియమించారు.

శివకేశవులకు పంచామృతాభిషేకాలు



శివకేశవుల పూజల్లో పాల్గొన్న మహిళలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేటలోని కళ్యాణ వేంకటేశ్వర స్వామి, జానకి, రామాంజనేయ, గౌరీ శంకర, సాయి మందిరంలో కార్తీక శుక్రవారం పర్వదినం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. శివకేశవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. తొలుత మహిళలు 108 కలశాలతో సుగంధ ద్రవ్యాలతో భారీ ఊరేగింపుతో ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. అభిషేకం అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ చేశారు.

హాస్టళ్ల పరిశీలన

ఏలూరు (టూటౌన్): స్థానిక అమీనాపేట అంబేడ్కర్ సైన్స్ పార్క్ వద్ద ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహం, బీసీ హాస్టల్స్–1, –2, –3లను జనసేన నేత రెడ్డి అప్పలనాయుడు శుక్రవారం పరిశీలించారు. బాలికలు హాస్టల్‌లో ఫ్లోరింగ్, వాటర్ ప్యూరీఫైయర్, కాలేజీ గరల్స్ హాస్టల్‌లో ఫ్లోరింగ్, విండో నెట్స్ సమస్యలు ఉన్నాయని ఆయన తెలిపారు. పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

పోష్ చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): పోష్ చట్టంపై అవగాహన పెంపొందించుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో మహిళా ఉద్యోగులకు పోష్ యాక్ట్ 2013, సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపుల నిరోధం అనే అంశంపై శుక్రవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో రత్నప్రసాద్ మాట్లాడారు. మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టడానికి అనేక చట్టాలు రూపొందించారని, ఈ చట్టాలలో భాగంగా పోష్ యాక్ట్‌ను తీసుకొచ్చారని వివరించారు. మహిళా ఉద్యోగుల రక్షణకు కమిటీలు ఏర్పాటు చేయాలని, ఎవరికైనా వేధింపులకు గురైతే కమిటీకి ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు. కమిటీ సభ్యుల వివరాలను సంబంధిత కార్యాలయంలో ఉంచాలన్నారు. ఫిర్యాదు చేసిన మహిళా ఉద్యోగులు వివరాలు గోప్యంగా ఉంచుతారని చెప్పారు. కార్యక్రమంలో ట్రైనీ జడ్జీలు వి.రఘునాథ్, టీఏఎస్ఎస్ఆర్ ఆదిత్య రిషిక్, ఏవీ నాగరాజు, కె.స్పందన, జేబీటీఎస్ దేవి, కుమారి, డి.అరుంధతి ప్యానల్ లాయర్లు పాల్గొన్నారు.

ఏలూరులో 'అభయ' రక్షక దళం గస్తీ



సెయింట్ థెరిస్సా వద్ద విద్యార్థినులతో అభయ రక్షక దళం

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా మహిళలు, యువతులు, విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ జిల్లాలో అభయ రక్షక దళాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఏలూరు నగరంలో ఉదయం, సాయంత్రం వేళల్లో వేలాది మంది విద్యార్థినులు ఇళ్ల నుంచి బడులకు, కళాశాలలకు వెళ్తుంటారు. ఇదే సందర్భంలో కళాశాలల వద్ద, విద్యా సంస్థల వద్ద ఆకతాయిలు వేధింపులకు గురిచేస్తున్న నేపథ్యంలో ప్రత్యేక రక్షక దళాన్ని ఏర్పాటు చేశారు. మహిళా పోలీస్ సిబ్బంది ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో అభయ వాహనాలతో నగరంలో తిరుగుతూ విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా అండగా నిలబడుతున్నారు. విద్యార్థినులకు ఆపద వస్తే డయల్ 112కు, అభయ యాప్‌లో పోలీసులకు సమాచారం ఇస్తే 10 నిమిషాల్లో చేరుకుని ఆకతాయిల బరతం పడతామని విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు.

10న స్కూల్ స్వీపర్లు, ఆయాల సంఘం మహాసభ

ఏలూరు (టూటౌన్): ఏలూరు స్ఫూర్తి భవన్లో ఈనెల 10న నిర్వహించే ప్రభుత్వ పాఠశాలల, స్వీపర్లు, ఆయాల సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర రెండో మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.బుచ్చిబాబు, చాట్ల పుల్లారావు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. ఆయాలకు నాలుగు నెలల పెండింగ్ జీతాలు విడుదల చేయాలని, జీఓ 108 ప్రకారం కనీస వేతనం రూ.11,500 ఇవ్వాలని, నెలలో ఒకరోజు సెలవు ప్రకటించాలని కోరారు. 2018, 2019కి సంబంధించిన పాత బిల్లులు వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఏడాదికి రెండు జతలు యూనిఫాం ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యచరణను రూపొందిస్తామని పేర్కొన్నారు.

మహిళను వేధించిన వ్యక్తి అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరులో న్యాయవాద వృత్తిలో ఉంటూ ఒక మహిళను వేధింపులకు గురిచేసిన ఒక వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పెదవేగి మండలం కొండలరావుపాలెం గ్రామానికి చెందిన ఆళ్ల సత్యనారాయణ ఏలూరులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఒక వివాహితను సెల్‌ఫోన్‌కు వాట్సాప్‌లో అసభ్యకరమైన మెసెజ్‌లు పంపుతున్నారంటూ మహిళ ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు 2021లో ఫిర్యాదు చేసింది. దీంతో వన్‌టౌన్ పోలీసులు సత్యనారాయణను శుక్రవారం అరెస్టు చేశారు.

రూ.3.28 కోట్ల ధాన్యం సేకరణ

ఏలూరు(మెట్రో) : జిల్లాలో ఇప్పటి వరకు రూ.3.28 కోట్లు విలువైన 1417.280 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు వి.శ్రీలక్ష్మి తెలిపారు. ధాన్యం కొనుగోలుపై ఫిర్యాదులు ఉంటే జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు 08812–230448, టోల్ ఫ్రీ 18004256453కు కాల్ చేయవచ్చన్నారు. క్వింటాలు కామన్ ధాన్యానికి రూ.23,00, గ్రేడ్ ఏ రకానికి రూ.2,320 చొప్పున చెల్లిస్తున్నట్టు చెప్పారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.45	4820	23
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.15	4822	20
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	31
ఏలూరు–బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	25
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు – తిరుపతి	16.00	4830	28

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	96
వంకాయలు (కాంతులు)	60–68	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	46–56	ములక్కాడలు	07, 10
బెండకాయలు	34	కంద	64
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	64
కాకర కాయలు	40–44	కీరా దోస	36
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	00	అల్లం	80
క్యాబేజీ	36–40	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	60–80	పాలకూర	15
దొండకాయలు	28	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	45	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	36–40	బఠాణి	--
ఆనపకాయ (1)	25–30	క్యాప్సికమ్	96
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	40

మెట్టలో పొగాకు సాగు ప్రారంభం

జిల్లాలోనే లింగపాలెం నాటు పొగాకుకు ప్రసిద్ధి



లింగపాలెం మండలంలో నాటు పొగాకు నారు మడులు

లింగపాలెం: మెట్ట ప్రాంతమైన లింగపాలెం మండలంలో నాటు పొగాకు సాగు ప్రారంభమైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నాటు పొగాకు నారు మడులు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. పొగాకు సాగుకు కొన్ని గ్రామాల్లో నారు కొరత ఏర్పడింది. నారుకు డిమాండ్ పెరిగింది. జిల్లాలోనే ఈ మండలంలో నాటు పొగాకు పండించటంలో రైతులు ఎంతో ప్రసిద్ధి చెందారు.

కంటికి రెప్పలా కాపాడుకోవాలి

ఈ పంటను పండించాలంటే రైతులకు రిస్కుతో కూడిన వ్యవహారం. ఈ పంట పూర్తయ్యే వరకు కంటికి రెప్పలా చూసుకోవాలి. నీరు తక్కువతో ఈ నాటు పొగాకు సాగు పూర్తవుతుంది. ఈ ప్రాంతంలో నీటి సమస్య కారణంగా రైతులు మండలంలోని కె.గోకవరం, ములగలంపాడు, రంగాపురం, కొత్తపల్లి, నరసన్నపాలెం, మఠంగూడెం, తోచలకరాయుడుపాలెం, పుప్పాలవారిగూడెం, కొణిజర్ల తదితర గ్రామాల్లో ఈ నాటు పొగాకును రైతులు ఎక్కువగా సాగు చేస్తారు. ఈ నెలాఖరు వరకు ఈ తోటలు వేసేందుకు అనువుగా ఉంటుంది. గత ఏడాది వైరస్ తెగుళ్లు వ్యాపించి దిగుబడులు తగ్గిపోయాయన్నారు. గత ఏడాది మండలంలో 3,010 ఎకరాల్లో ఈ నాటు పొగాకు పంటను రైతులు సాగు చేయగా ఈ ఏడాది 3,200 ఎకరాల్లో పైగా నాటు పొగాకు వేసేందుకు రైతులు నారుమళ్లు వేశారు. ఈ ఏడాది మరో 190 ఎకరాల్లో నాటు పొగాకు పంటను అదనంగా సాగు చేయనున్నట్టు రైతులు తెలిపారు. ఎకరాకు సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతుందని వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే పంట బాగా పండితే 4 నుంచి 5 పుట్ల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఈ పంట 120 రోజులకు చేతికి అందుతుందన్నారు. ఇక్కడ పండిన పొగాకును గుంటూరు, విజయవాడుకు చెందిన వ్యాపారులు వచ్చి పెద్ద ఎత్తున్న రైతుల నుంచి కొనుగోలు చేసుకుని లారీలపై ఎగుమతులు చేసుకుని వెళతారు. నాటు పొగాకుకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



మెట్ట ప్రాంతంలో రబీలో సాగు చేసేందుకు నీటి సమస్య కారణంగా తక్కువ నీరుతో పండే నాటు పొగాకు పంటను సాగు చేస్తున్నాం. పంటను సాగు చేసిన దగ్గర నుంచి చేతికి అంది వచ్చే వరకు కంటికి రెప్పలా చూసుకోవాలి. గత ఏడాది నాటు పొగాకు ధర సరిగా లేదు. ఈ ఏడాది ప్రభుత్వం నాటు పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి.

– రెడ్డిన శ్రీను, రైతు, రంగాపురం

వ్యక్తి మృతిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఒక వ్యక్తి మృతిపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంకు చెందిన ఉప్పల శ్రీనివాస్ (47) ఈ నెల 6వ తేదీన మోటార్‌సైకిల్ ఫైనాన్స్ డబ్బులు కట్టడానికి జంగారెడ్డిగూడెం వచ్చాడని, సాయంత్రం ఇంటికి ఫోన్ చేసి ట్రాక్టర్ తీసుకొస్తున్నానని, లేటు అవుతున్నందున ఇంటికి రావడం లేదని తెలిపాడన్నారు. అయితే 7వ తేదీ సాయంత్రం శ్రీనివాస్ మొబైల్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి శ్రీనివాస్ భార్య లీలావతికి ఫోన్ చేసి వేగవరం గ్రామం పొగాకు మొద్దుల ఫ్యాక్టరీ సమీపంలో గ్యాస్ నొప్పితో శ్రీనివాస్ పడిపోయాడని తెలిపాడన్నారు. వెంటనే లీలావతి కుమారుడితో కలిసి ఘటనా స్థలానికి చేరుకోగా, శ్రీనివాస్ విగత జీవుడిగా కనిపించాడన్నారు. ఈ మేరకు లీలావతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు. కాగా శ్రీనివాస్‌కు గ్యాస్ నొప్పి సమస్య ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు హెచ్‌సీ తెలిపారు.

వరి సాగు విధానం పరిశీలన

దెందులూరు: పంట కోత ప్రయోగం, రైతుసేవా కేంద్రాల పనితీరును ఢిల్లీ నుంచి వచ్చిన బృందం పరిశీలించినట్టు వ్యవసాయశాఖ ఇన్‌చార్జి అధికారి దామా వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం గోపన్నపాలెం, గాలాయగూడెం గ్రామాల్లో రైతు సేవా కేంద్రం, వరి పొలాలను బృందం పరిశీలించిందన్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించిందని తెలిపారు. సాగు చేసే విత్తనం, ఖర్చు, దిగుబడి, వాతావరణ పరిస్థితులు, రవాణా, ఇతర అంశాలపై ఆరా తీసిందని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు సలహాలు నిరంతరం తీసుకోవాలని రైతులకు సూచించినట్టు చెప్పారు.

రైతులకు ప్రతికూల పరిస్థితులు

- వాతావరణ మార్పులతో నష్టం
- యంత్రాలతో వరి కోతలు



దెందులూరులో వరికోస్తున్న యంత్రం

దెందులూరు: సేంద్రియ వ్యవసాయంతోపాటు అంతర పంటసాగులో అద్భుతాలు సృష్టించిన గ్రామాల్లో నేడు వాతావరణ పరిస్థితులు రైతుల పాలిట శాపంగా మారాయి. కొన్నేళ్లుగా వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నారు. అప్పు తెచ్చి సాగు చేసి పంట చేతికి వచ్చే సమయానికి వర్షాలు, వరదలు రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వాతావరణ ప్రతికూల పరిస్థితులతో పంటలపై పెట్టిన పెట్టుబడి సైతం చేతికి రాకపోవడంతో అప్పులపాలవుతున్నారు. దెందులూరు నియోజకవర్గం నాలుగు మండలాల్లో సార్వాలో 47 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. అధికంగా 1318 స్వర్ణ రకం వరి సాగు చేశారు. పంట కోతకు వచ్చే సమయానికి తుఫాను ప్రభావంతో వర్షాలు కురిసి రైతన్నల నడ్డివిరుస్తున్నాయి. కోతలు రెండు వారాల్లో ప్రారంభమవుతాయనుకునే సమయానికి ఇటీవల వచ్చిన తుఫాన్‌కు దాదాపు గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. దీంతో కూలీలతో వరి కోతలు కోయిస్తున్నారు. ఎకరానికి యంత్రంతో అయితే రూ.30 వేలు ఖర్చు అవుతుంది. కూలీలకు కూడా దాదాపు అంతే ఖర్చు అవుతుంది. రైతు భరోసా హామీని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేయడంతో రైతుల్లో తీవ్ర నిరుత్సాహం అలముకుంది.

120 ఎకరాల్లో కోతలు పూర్తి

దెందులూరు నియోజకవర్గంలో 120 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. రైతులందరూ వరికోతల్లో నిమగ్నమయ్యారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి.

– సుబ్బారావు అసిస్టెంట్ డైరెక్టర్ వ్యవసాయ శాఖ

మోసం చేశారు

గత ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట వేశారు. రైతు భరోసా సమయానికి అనుకూలంగా రైతుల ఖాతాలకు జమయ్యేది. కూటమి ప్రభుత్వం రైతులను కుదేలు చేసింది. ఎన్నికల ప్రచారంలో రైతు ప్రభుత్వం అంటూ నానా మాటలు చెప్పి మోసం చేశారు.

– పర్వతనేని నరేంద్ర, రైతు, మలకచర్ల